

# మిత్తవ

మంచికంటి వెంకటేశ్వరరెడ్డి

"ఏం మనిషమ్మా నీ కొడుకు. ఇల్లొదిలి పెట్టిపోయి ఇయ్యాల్టికి ఎన్ని రోజులైందో లెక్కేలేదు. ఒక మంచి లేదూ, చెడూ లేదూ. ఏమైపోయాడో తెలీదు," సుబ్బమ్మ వంక చూస్తూ అంది గోయిందమ్మ.

సుబ్బమ్మ వొంచుకున్న తల ఎత్తి గోయిందమ్మను చూసింది కానీ, నోటి నుంచి ఒక్కమాట కూడా రాలేదు.

"ఇట్టాంటోళ్లతో ఎట్ట సంసారం జేసేది. ఇల్లూ ఒళ్లూ పట్టకుండా తిరుగుతుంటే, అమ్మా అబ్బా అదు పాజ్జలు తప్పొడులే, ఎట్టోకట్ట సావనియ్యమని చెప్పి ఒంటి చేత్తో రొంటినొక బిడ్డని, చేతినొక బిడ్డని ఏసుకుని పోరకాడతా వుంటే, మగరాయుల్లా పనిజేస్తుందిరా అనే వోళ్లు కదా!" అంటూ ఆయాసం తీర్చుకోడానికి ఆగింది గోయిందమ్మ.

సుబ్బమ్మలో అప్పటికీ చలనం రాలేదు. గోయిందమ్మ ఎన్ని మాటలన్నా ఊ... లేదు... ఉప్పరాయి లేదు.

దాంతో గోయిందమ్మకు ఇంకా ఆవేశం ముంచుకొచ్చింది. "పుట్టి బుద్దెరిగినాక ఇంత కటీనమైన మనిషిని నేనెక్కడా చూళ్లేదు. ఏళ్లూ వూళ్లూ దాటొచ్చి ఈ ఊబిలో పడ్డాను. చేలోనించి గింజలొచ్చి ఎన్నాళ్లయింది ఇంటికి. అయినా ఇన్నాళ్లూ ఎట్టోకట్ట నెట్టుకొచ్చేనా! అయ్యో రామా! లెక్కకు మడిసేగానీ, ఏనాడన్నా అటు పుల్ల దీసి ఇటు పెట్టేడా! అబ్బో అబ్బో... కొరివితో తల గోక్కున్నట్టే గదా! పోతాపోతా నా మానాన నన్నొదిలేస్తే, ఏ నుయ్యో గొయ్యో చూసుకుందును. నిన్నొకదాన్ని నా యెదానేసి పోయేడు గదా! ఎంత నెత్తీ నోరు గొట్టుకున్నా చెవిటి మేళానివైపోతివి. మణుసులో మాట చెప్పుకుంటానికి ఒక అసిదోడు కూడా లేకపాయె," అంటుంటే గోయిందమ్మ కళ్ల వెంట టపటపా కన్నీళ్లు కారాయి.

పవిట చెంగుతో కళ్లొత్తుకుంటూ, "ముసలమ్మా ఏం జేద్దాం. అర్ధరేత్తిరి కాడ పోయినోడు అదే పోవడం. అంతూ పొంతూ లేదు. కాలమేమో ఎదురు తిరిగింది ఏం జేసేటట్టు" అంటూంటే ఏడుపు ఆగలేదు. అంతే పలపలా ఏడుస్తూ ఇంట్లోకి వెళ్లింది గోయిందమ్మ.

వయసుడిగిపోయి, ముఖమంతా ముడతలు బడి, కళ్లమసకలు కమ్మి, బోటుకర్రతో తిరిగే సుబ్బమ్మకి గంట నుండీ గోయిందమ్మ వెళ్లబోసుకుంటున్న సొదంతా వినపడకపోయినా అర్థమవుతానే ఉంది. మనసంతా దిగులు మబ్బులు కమ్ముకొని, గోయిందమ్మ కళ్లల్లో కళ్లు పెట్టి చూడలేక తల వొంచుకునే ఉంది.

'మెళ్లో పసుపుతాడు పడిన్నాటి నుంచీ, రెండు కాళ్లూ ఒకచోట పెట్టిన బాశాలి గాదు. ఎప్పుడూ ఎవుర్నీ ఎప్పుడూ పల్లెత్తు మాటన్నదీగాదు. అట్టాంటిది ఇయ్యాల ఈ కాని కాలమొచ్చి, కాలుజెయ్యీ ఆడకుండా జేస్తందే! వాడు ఇల్లు బట్టకుండా తిరిగినా పల్లెత్తు మాట అన్న పాపాన పోలేదు. అది మాత్రం ఏం జేస్తది. పాపం కాలూ జెయ్యాడక పోయె. ఎవురి బిడ్డయితేమి? కాలికి బలపం గట్టుకొని తిరిగి తిరిగి చేసింది. కాలూ చెయ్యాడక విలవిల్లాడుతుంది గదా,' అనుకుంటూ కోడలి గురించి లోపల్లోపలే కుమిలిపోసాగింది. ఆ దుఃఖం ఆమెను గతం పొరల్లోకి లాక్కుపోయింది.

'యాభై అరవై సంవత్సరాలుగా ఇట్టాంటి మిడిమేలపు కాలాన్ని చూసెరగం గదా! ఎంత పెద్ద ఆసామి

గూడా ఊరూవాడా వొదిలి పెట్టుకోని, ఒకయ్యకాడ చెయ్యి జాపి దేబిరిచ్చాల్సొచ్చిన పాడుకాలమిది. ఇంత కాలం గొడ్డు శాకిరీజేసి సముదాయిచ్చుకొచ్చింది. ఉండ పొలానికి తోడు కొంత మగతాకీ, కొంత పాలికీ దీసికొని చేస్తుంటే దేనికీ దిగ్గులూ యిశారమూ లేకుండా గడిచి పోయింది.

సచ్చేడుండాడో ముసిలోడు. 'గోయిందా! ఎందుకే? మనకి ఉండదాంటో చేసుకుని కలోగంజో తాగుదాం. అంతా నాదేనని వాటేసుకుని పరిగెత్త బోతావు' అని పైమాటకనేవోడు గానీ, కొడుకు ఎంత ఎదవతనంగా తిరుగుతున్నా కోడల్ని జూసుకోని తెగ మురుసుకునేవోడు.

అట్టాంటి సంసారం ఈటుబోయేతలికి మొగతా లోళ్లొచ్చి ఇంటిమీద పడతన్నారా! అప్పులోళ్లొచ్చి చెప్పుతో కొట్టబోతున్నారా! మాలోళ్లు ఒక తట్టు పీక్క తింటన్నారా. ఇంట్లో తింటానికి ఇత్తు లేకపోయె. సాగి నన్నాళ్లూ అటొక మాట ఇటొక మాట చెప్పి కాలం గడిపి నోడయిపోయె కొడుకు. ఇయ్యాల యాడదాడ ముగసక పోయేతలికి కాలూ జెయ్యాడక దేశాల మీద పడ్డాడు.

ఊళ్లో మాత్రం ఇంకెవురు మిగిలుండారు. వొయిసులో ఉండోళ్లందరూ పిల్లాజెల్లలతో ఊరిడిసి పెట్టి పోతిరి. వాళ్లతో పాటు పోయినోడు పోయినట్టే అజా పజా లేడు. ఒక్క జాబుముక్కయినా రాసిన పాపాన బోయాడా పాపాత్ముడు. ఇంతమందిని గాలికొదిలేసి అదే పోవడంగదా! అనుకుంటుంటే ఎండిపోయిన కళ్లల్లోంచి కూడా ఊట తన్నుకొని వొచ్చింది.

గుడ్డల సంచీతో బైటికి వొచ్చిన గోయిందమ్మ వైపు అనుమానంగా జూసింది సుబ్బమ్మ.

"ఇంక ఈడ ఉండి మాత్రం చేసేదేముంది. అందుకే నేనూ ఊరు ఇడిసిపెట్టి ఎల్తున్నా. మనూళ్లనే ముసిలీ ముతకా ఉండారు కదా! ఎవురో వొచ్చి గెంజి కాసి పోస్తారంట. నువ్వాడికి బోయి ఆ గంజి తాగన్నా పేణం నిలుపుకో! బతికుంటే మల్లీ వొస్తాను. ఎంత అర్దానం బతుకైపోయిందో," అంటూ సుబ్బమ్మ దగ్గరగా వొంగి పెద్దగా అరిసి మరీ చెప్పింది గోయిందమ్మ.

"మిత్తవ ఊళ్ల మీద పడింది. నువ్వు మాత్రం ఏం జేస్తావులేమ్మా. అసిదోడు లేకుండా అయిపోయావు. నాదేముందిలే. ఊరు పొమ్మంటుంది. కాడు రమ్మం టుంది. నీకు ఎట్టా దోస్తే అట్నే చెయ్యమ్మా," అంటూ తల వొంచుకుంది.

సంచీ సంకన తగిలించుకొని పిల్లల్ని దీసుకొని ఇంటి నుండి బయటబడింది గోయిందమ్మ. తలపైకెత్తి పొద్దుకి చెయ్యడ్డం బెట్టి బారజూసింది. "అయ్యో! పొద్దు నడినెత్తి కొచ్చినట్టుందే," అనుకుంటా, వడివొడిగా నాలుగడుగులేసింది. అంతలోనే ఆగి వెనక్కి మళ్లీ ఇంటిని తేరిపార జూసింది. ఏడుపు పొగిలి పొగిలి వచ్చింది. ఇన్నేళ్లు శాకిరీ జేసి సంపాయిచ్చింది ఏముంది అనుకునేసరికి ఇంక ఎంత ఆపుకుందామనుకున్నా ఏడుపు కట్టలు తెంచుకుంది. ఆమెని జూసి పిల్లలిద్దరూ బిక్కమొహం వేసి, "ఎందుకమ్మా ఏడుస్తుండావు? అమ్మా యాడవ బాకమ్మా! నాన కాడికే గదా పోతంది," అంటూ చెరోవైపున చీర పట్టుకుని లాగసాగేరు.

నాది నాది అని ఎంతగా పాకులాడేను. ఇప్పుడే మైంది! అనుకుంటూ గుండె దిటవు జేసుకొని దారి బట్టింది.

పొలాల్లో నుండి అడ్డ రోడ్డునే నడుస్తుంటే కడుపు తరుక్కుపోతంది. పొలాలన్నీ యాడలేని నిశ్శబ్దాన్ని దిగమింగి బావురుమంటున్నాయి. ఏ చేలోనూ మనుషు లతో సందడి సందడిగా ఉండే పొలాలు, చూపానినంత దూరం ఎక్కడా పురుగన్నమాట లేకుండా దిబూసి మంటున్నాయి.

## 2

వొడివొడిగా నడుస్తున్న తులశమ్మ దారిలో తారస పడింది. "ఏ ఊరి పయాణం తులశప్పా," వెనకనుండే పలకరించింది గోయిందమ్మ.

ఎవురా పలకరించిందని వెనక్కి తిరిగి చూసి, "గోయిందా నువ్వా ఊరొదిలిబెట్టేక యాడకెల్తే ఏంది లేమ్మా. ఆగిందే ఊరు, దొరికిందే పనిగదా. కడుపొత్తరం కోసం గంపెడంత చీకట్ని బుజానేసుకుని పోతా వుండాము. యాడ తేల్తామో. యాడ మునుగుతామో. దరీ దోసకుండా ఉంది," అంటూ నిట్టూర్పు విడిచింది.

"ఇన్ని అగచాట్ల మారి కాలం ఎప్పుడొచ్చిందే! ఏ మూలకెళ్లినా ఉగ్గినెడు ఉప్పునీళ్లయినా పుట్టకపో తుండే. ఏ బాయిలోనా గొంతు తడుపుకోడానికి సుక్క నీరు లేదా! బోరింగు పంపులు గలగల మోగి ఎన్నాళ్ల యింది. ఆరుమైళ్లు నడిస్తే అక్కడా దొరికేది ఉప్పునీళ్లే గదా. అయ్యి తాగితాగి దావాగ్ని పెరుగుతుందేగానీ తగ్గుతుందా! పైగా వాంతులూ, బేదులూనూ. ఊళ్లో ఉండి చావునేడ కొని తెచ్చుకుంటాము. పిల్లాజెల్లా నేసు కుని బాబాయెల్లేడమ్మాయ్. ముసిలీ ముతకా వుండారు గదా! వాళ్లని జవిరిచ్చుకోని నేను బయల్దేరేను.

''అబ్బా ముక్కులు పగిలిపోతుండయ్యి గదమ్మాయ్. యాడేడ సచ్చిన గొడ్లన్నీ దెచ్చి ఈణ్ణే ఏసేరు లాగుంది. కుక్కలూ, కాకులూ, గద్దలకి పండగే పండగ'' అంటూ గట్టిగా ముక్కు మూసుకుంది తులశమ్మ.

"ఎక్కడా గడ్డిపూస లేకపోయె. యాడ జూసినా ఎఱ్ఱనగ్గి మండుతా ఉంటే సావకేం జేస్తయ్యి," అంది గోయిందమ్మ.

''మ్మాయ్. అదుగో బస్సొస్తంది. పరిగెత్తు. పరిగెత్తు. రేయ్ నువ్విట్రా,'' అంటూ పిల్లోడి చెయ్యి బట్టుకుని, "నువ్వా పిల్లని దీసుకొని రామ్మా," అంటూ పరుగు పరుగున రోడ్డుమీద కెళ్లి బస్సును ఆపింది తులశమ్మ.

గతుకుల రోడ్డుపై బస్సు గడగడమంటూ పెద్ద శబ్దం చేసుకుంటూ వచ్చి కీచుమని ఆగి పోయింది.

దిగేవాళ్లు దిగుతుండారు. ''ఇంతకీ నువ్వేడ కెల్తన్నావో చెప్పనేలేదే గోయిందా. పైగా ఎప్పుడూ ఊరు దాటినదానివే గాదు,'' ఆరా తీసింది తులశమ్మ.

"అదే తెలవకుండా ఉంది. ఈళ్ల నాయన ఎటు బోయాడో తెలియదు. ఊళ్లో ఉండేవల్ల లేకే బయల్దేరాను. యాడ తేల్తామో! ఏందో!'' అంది బాధగా గోయిందమ్మ.

యాడక్కేందుకూ సందులేని బస్సులోకి తోసుకుంటూ ఎక్కుతున్నారు జనం. పైనా కిందా ఎటు జూసినా జనమే. ఎట్టెక్కేట్టబ్బా అని ఆలోచిస్తుండంగానే ''రాయే గోయిందా రా! రా!'' అంటూ పిల్లోడిని లాక్కుని, కింద మెట్టు మీద కాలుబెట్టి వాడిని లోపలికి నెట్టింది. ''ఆ యమ్మాయిని పైకి ఎక్కిచ్చి ఈ మెట్టు మీద కాలానించు. ఈ బస్సు పోయిందనుకో! ఇంక పైటేళదాకా బస్సే లేదు. ఈ ఎండలో బడి సావాల్సిందే! ఎక్కెక్కు,'' అంటూ తొందరజేసింది.

ఈ పిల్లల్నేసుకుని ఈ సముద్రంలో ఈదాలంటే అయ్యే పనేనా అని తటపటాయించింది. అసలా జనాన్ని చూస్తంటేనే గుండె పగిలిపోతంది. బస్సు బయలుదేరడానికన్నట్టు డ్రైవర్ హారన్ కొట్టాడు.

తప్పని పరిస్థితుల్లో గుండె రాయి జేసుకుని, పిల్లని ముందే పైకి నెట్టేసి కింద మెట్టు మీద కాలానించింది గోయిందమ్మ.

కండక్టర్ గంట కొట్టడంతో బస్సు బయల్దేరింది. గోయిందు నానుకుని ఇంకా నలుగురైదుగురు వేలాడుతున్నారు. బస్సు వేగంగా పరిగెడుతోంది.

అంత ఇరుకులో కూడా సందు జేసుకుని బైటకు చూస్తా, ''గోయిందా! అటుజూడవే ఆ చేలు సాయ. ఎట్టా ఎండి పరిగలయినియ్యో! ఎంత లెక్కజూసినా బొందుబోయిన పైరే గదా! యాడ మోటార్లాడ సచ్చిన మడుసుల్లా ఎట్లా పడుండయ్యో సూడు,'' అనింది తులశమ్మ బాధగా.

యాడ చెయ్యి జారితే కింద బడతానోననే భయంతో నోటమాటరాక, గుడ్లప్పగించి చూస్తా ఉండి పోయింది గోయిందమ్మ.

బస్సు కదిలి అర్ధగంట కాలేదు. ఐదారు గొడ్ల లారీలు బస్సుని దాటిపోయాయి. గోయిందమ్మ వాటిని జూసి నోరిప్పకుండా ఉండలేకపోయింది. ''ఏంది? తులశమ్మ, యాడకి ఇన్నిన్ని గొడ్లు బోతండయ్యి,'' అంటూ ఆ లారీల వంక చూస్తూ ఉండిపోయింది.

''యాడకేందమ్మాయ్ కసాయికొట్టుకేగదా! ఆరుగాలం మేపీ మేపీ ఇయ్యాల మండికి తోల్తుండారు. దయాదాక్షిణ్యం లేకుండా అమ్మి పార్నూకిన గొడ్లయ్యన్ని. మడుసులే తింటానికి ఇత్తులేక అల్లల్లాడుతుంటే ఇంకా గొడ్లని మేపడానికి మేతెక్కడ తేవాలా. ఒక్కో బొడ్డొచ్చి పది రూపాయలుండేది. ఇప్పుడు అరవై డెబ్బయి బెట్టినా దొరికేది అంతంతమాత్రంగానే ఉంది. ఏటికేడు ధర బెరగటం అట్టుండనిచ్చి ఈ ఏడొచ్చినంత కలికాలం నేనెప్పుడూ జూళ్లేదమ్మా,'' అంది నిట్టూర్పు విడుస్తూ తులశమ్మ.

దారి పొడుగూతా దిగేవాళ్ల కంటే, ఎక్కేవాళ్లే రెట్టింపుగా ఉన్నారు. వాళ్ల చేతుల్లో, నెత్తుల మీద, సంకల్లో మూటలు, చెంబులు, సెరవలు ఉండటంతో తలకేసి, మొహానికేసి గుద్దేస్తా ఉండారు. ఈ దెబ్బకి పిల్లలు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతా ఉండారు.

సెగ్గాలి ఈడ్చి కొడతంది. బస్సులో ఉక్కపోతకి, అందరొదిలే వేడిశ్వాసకి బస్సు లోపలంతా చెమటతో కలిసి జీవితం మీద విరక్తి పుట్టేటంత వాసన వేస్తుంది. అదీగాక బస్సుల్లో ప్రయాణం జేసి ఎన్నాళ్లో గావడం వల్ల గోయిందమ్మకి ఎంతో ఇబ్బందిగా అనిపిస్తూ ఉంది.

బస్సు రద్దీకి అందరూ వాకిట్లో నుంచి లోపలి కొచ్చిపడ్డారు. మునికాళ్ల మీద నిలబడి ఇరవై మైళ్లు పైనే రావడంతో కాళ్లు లాగేస్తున్నాయి. ముందూ వెనకా కదేసి ఒత్తడంతో ఒళ్లంతా పుండైంది. "అమ్మా! ఆకలే ఆకలే,'' అంటూ పిల్లలు గొడవ మొదలుబెట్టారు.

పిల్లల్ని జూస్తంటే కడుపు తరుక్కుపోతుంది. డొక్కల్లోకి లాక్కుపోయిన కడుపు, పుల్లల్లా ఎండి

పోయిన కాళ్లూ చేతులూ పరిక్కంపలాగా ఎండిపోయిన నెత్తి, పీక్కుపోయిన ముకం, పుట్టిన కాడికి పోయారు. పిల్లలకి కడుపునిండా ఇన్ని మెతుకులు పెట్టలేకపోయా నన్న దిగులు యెంటాడతానే ఉంది.

పిల్లల మొకం జూసేతలికి కడుపులో దేవినట్టుగా ఉంది. ఇద్దరూ తోటకూర కాడల్లా యాలబడి పోతుం డారు. కడుపునిండా కూడుదిని ఎన్ని రోజులైందో గదా!

ఇంటినొదిలి పెట్టి రొండుగంటలే అయినా ఏడు పొచ్చేస్తంది. ఎంత కొంపలు మునిగే పనొచ్చినా సరే ఇల్లొదిలి పెట్టింది లేదు. ఒక్క పూటెప్పుడైనా ఇల్లొదిలి పెడితే మళ్లీ ఇల్లు చేరిందాకా ప్రాణం గుటగుట లాడి పోయేది. ఇల్లెట్టుందో, గొడ్లని మేతకి తోలేరో లేదో, బర్రెల కాడ పాలు దీశారో లేదో, పైరులో కలుపు పెరిగి పోతందే, కందికంప మేడేమేశారో లేదో, వానొస్తే తడిసి పోతయ్యేమో... ఇట్టా మనిషేడకి పోయినా మనసంతా ఇంటి మీద, పొలం మీదే ఉండిపోయేది. ఇంత కాలా నికి ఇట్టా కానికాలమొచ్చి, ఇల్లిడిసిపెట్టి, ఊళ్ల మీద పడాల్సొచ్చింది.

## 3

బస్సు ఒంగోలు బస్టాండు దగ్గరికి జేరింది. కుదుపుకి ముందుకు పడబోయి, తమాయించుకుని, ఆలోచనల్లో నుంచి ఈ లోకంలో కొచ్చింది. బస్సంతా ఖాళీ అయిపోయింది. బస్సు దిగిన గోయిందమ్మ పిల్లల్ని దీసుకుని డిపో లోపలికొచ్చింది. ఈయన జాడే మన్నా తెలిసిద్దేమోనని, తెలిసిన వాళ్లెవరన్నా కనబడతా రేమోనని డిపో అంతా బారజూసింది.

ఆ ఊరివాడే రాంకోటు బజారుకెళతా కనిపిం చాడు. ''అన్నా! మా ఇంటాయనేమన్నా తగిల్నాడా నీకు,'' అంది గోయిందమ్మ ఆత్రంగా.

''లేదు గోయిందమ్మా, నేనీడకొచ్చి వారంరోజుల పైనైంది. ఈడేడన్నా పనీ అదీ దొరకుతుందేమోనని, కాలికి బలపం గట్టుకొని తిరుగుతుండాను. ఎక్కడా తగల్లేదే గోయిందా. తగిల్తే చెప్పనంటగనీ, ఉండటానికి పనులేమీ లేక ఈణ్ణుండే జనాలందరూ యాడకేడకో ఎగిరిపోతుండారు. అట్టాంటిది ఈడేం పెరక్క తింటా నికి ఉంటారే! అవునే నువ్వేడకి పిల్లల్నేసుకొని బయల్దేరావు!'' అన్నాడు.

''ఏం జెప్పాలన్నా గంపెడు చీకటిని నెత్తి మీదేసు కుని ఎల్తున్నా. యాడకని ఎల్లేటట్టో అంతూ దరీ దొరకడంలేదు. ఈయన యాడన్నా కనబడతాడేమోనని చూస్తుండాను. ఆయన పాటికాయన ఊళ్ల మీద పడి పోయాడు. ఈ పిల్లల్ని సముదాయిచ్చుకుంటూ తిరగ టమే కనగష్టమైంది. పిల్లలేమో అన్నమో రామచెంద్రా అని అల్లాడుతున్నారు. ఏం జేసేటందుకూ దరి దోచటం లేదు.''

చేతిలో ఉన్న నాలుగు రూపాయలు ఊరికి బోవ డానికి బొటాబొటీగా సరిపోయేట్టుంది. అయినా పెద్ద బజాట్ల ఈరాసామి కొట్టుకాడికి బోయి కనుక్కుం దాము, ఈ సుట్టుపక్కల యాడ తిరుగుతున్నా అక్కడ తగిలిగాను పోడని, పెద్దబజారు కొచ్చింది.

''ప్చ్! లాభం లేకపోయింది. నాక్కనిపించే మూణ్ణెల్లయ్యిందమ్మా! పైగా వెయ్యి రూపాయలు బాకీ గూడా ఉంది. నువ్వన్నా ఇవ్వరాదంటమ్మా,'' అన్నాడు ఈరాస్వామి.

''అయ్యో! ఇచ్చినట్టే ఉందయ్యా నా బతుకు,'' అని నెత్తీనోరు బాదుకుంటూ నాలుగడుగులు ఇవతలి కొచ్చి, నడిసే ఓపికలేక కొట్టు ముందు అరుగుంటే దాని మీద సతికిలబడింది.

''ఇదుగో! ఇక్కడ లేమ్మాలే! కొట్టుకి అడ్డంగా బారజాపుకోని కూచ్చున్నావు. లేసి, అవతలికి బో,'' అని కొట్టో నుంచి కుర్రోడు కేకేయడంతో అక్కణ్ణుంచి లేసి, మళ్లీ బస్టాండుకొచ్చింది. ఇక ఎటుపోవాలో అను కుంటూ ఆలోచిస్తా అరటిపళ్లమ్మే బళ్లెనక బండలుంటే వాటి మీద కూర్చుంది.

గంటా... రెండు గంటలూ... మూడుగంటలూ కాలం గడిసిపోయింది. ఎంకటాపురమెల్లే బస్సులు ఒకటి రెండెల్లిపోయాయిగానీ కదలకుండా చూస్తా ఉంది. ఏం లాబంలేదు. అదీ దింపుడు కల్లాం ఆశే. ఇంకీణ్ణే ఉంటే అందరిమీ సోషొచ్చి పడిపోవడం కాయ మనిపించింది.

''అమ్మా దప్పికవుతందే,'' అంటూ పిల్లలు ఏడవడం మొదలుబెట్టేరు.

''ఇదుగో అన్నా! గుక్కెడు నీళ్లుంటే ఇప్పిచ్చన్నా పిల్లలకి గొంతెండిపోతంది,'' అనడిగింది అరిటికాయల బండాయన్ని.

ఆయనొకసారి పైకీ కిందకీ తేరిపార జూసి ''యాపూరు తల్లామంది?'' అని, ''అదుగో ఆ టిపిన్ కేరియర్లో పొద్దుననంగా తెచ్చుకున్నా, ఏందీ అదీ ఉప్పు నీళ్లు. ఉగ్గిన్నుడు, ఉగ్గిన్నుడు బోసుకొని గుంతు తడుపు కుంటూ పేణం నిలుపుకుంటన్నా. నీళ్లకెంత పిరింగా ఉందో తెలవదు లాగుందే,'' అన్నాడు.

''అయ్యో! ఏం గాశారమొచ్చి పడిందిరా నాయనా! ఒక సోడా అన్నా గొట్టిచ్చి తాపుదామంటే

ఎక్కడా కనుచూపు మేరలో సోడాబండి కనబళ్ళేదు. ఇంతకుముందు యాడ జూసినా కయ్యి కయ్యిమని మోత వినిపిస్తుండేది. 'ఏమైపోయారబ్బా ఈళ్లంతా,' అనుకుంటా ముందుకు సాగింది. ఏ బంకులో అడిగినా సోడా లేదన్నారు. ఇంక విసుగెత్తి పోయి, ఒక రూపాయి బెట్టి నీళ్ల పాకెట్టు కొనింది.

## 4

బస్సొచ్చి బస్టాండ్లో ఆగింది. అమ్మగారిల్లు బస్సు దూరంలో ఉంది.

అప్పటికి గోయిందమ్మ సహనం సచ్చిపోయింది. అయినా బస్సెక్కాలనిపించలేదు. 'ఎన్నిసార్లు కబురు జేసినా, నా పిల్లలూ, నా సంసారమూ, నా గొడ్లూ, గోదా అంటూ పోకుండా నీలుక్కోని కూసుండేదాన్ని. ఇయ్యాల అవటానికి అమ్మగారిల్లయినా ఏ మొకం బెట్టుకోనిబోవాలో అర్థమై చావడంలేదు,' అనుకుంది.

చీకటి పడిపోతంది. ఇంక తప్పదన్నట్టు గమ్మున బస్సెక్కి ఓ మూల బిక్కుబిక్కుమంటూ పిల్లల్తో పాటుగా కూర్చుంది.

ఎదురుగా కూకున్నొకామె తేరిపార జూస్తందని కొంగు మొకానికి కప్పుకుంది. కొంతసేపయి నాక "గోయిందా! నువ్వేనంటే. ఎన్నాళ్లయిందే నిన్ను జూసి. ఏందీ అవతారమూ నువ్వూ. ఎట్టుండే దానివి ఎట్టయి పోయావు. ఏందీ నీ పిల్లలేనా..." అంటూ పలకరించింది సామ్రాజ్జెం.

గోయిందమ్మ ఇళ్లు, సామ్రాజ్యం ఇల్లు ఒకదాని వెనక ఒకటి ఉండేవి. చిన్నప్పట్నుంచీ ఇద్దరూ కలిసి మెలిసి ఉండేవాళ్లు. ఒకరంటే ఒకరికి ప్రాణం. ఎక్కడికి పోయినా ఇద్దరూ కలిసి పోవాల్సిందే. ఏ పనైనా కలిసి చెయ్యాల్సిందే. పెళ్లియిందాకా అట్టనే కలిసిమెలిసి తిరిగారు.

"ఏమే గోయిందా, అమ్మకాడికేనా! అయినా ఎంతిదైనదానివి కాకుంటే నా సంసారమో, నా సంసారమో అని అంత లావు ఎగరగొట్టుగోడానికి ఎవురికి లేని జంజాటమమ్మా. పాపం మీ అమ్మ వారంరోజులు మూసిన కన్ను తెరవకుండా ఆస్పత్రిలో ఉంది ఒక్కసారి రమ్మనండి చూసిపోద్దని ఎన్నిసార్లు చెప్పంపిందే. అట్నే ఎగ్గొట్టేవు గదా" అంటూ దెప్పి పొడిచింది.

"ఇంకాపవే నీ నిష్ఠూరాలు. మొగోడు పనోడైతే నాకెందుకే ఈ తిప్పలన్నీ. ఇప్పుడు పెళ్లాం, పిల్లలూ, తల్లీ అనుకోకుండా ఎటెల్లాడో అంతూపొంతూ లేదు. ఎంటబడి ఎతకలేక చస్తున్నా. నీకేం నువ్వెన్నయినా చెబుతావమ్మా. దేశంగాని దేశం. ఉత్తరాది మొగుడు. ఊరూవాడా ఎల్లో కొల్లలుగా నీళ్లు. దేనికి తక్కువే నీకు. అందరికీ నీలాగా కుదురుద్దా ఏమైనా మాట్లాడతావు" అంది గోయిందమ్మ.

అంతలోనే మళ్లీ "ఇంతకీ నువ్వెట్టుండావే? పిల్లలెట్టుండారు? మీ ఆయన ఇప్పుడైనా కాస్త ఒళ్లు జేశాడా? అట్నే ఉండాడా? ఇంతకీ నువ్వెప్పుడొచ్చావు?" అంటూ స్నేహితురాలి గురించి ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించింది.

"ఆడ అందరూ బాగానే ఉండారుగనీ, ఈణ్ణే ఊళ్లో అందరికీ జెరాలు. అమ్మా నాన్నా లేవడం లేదు. అందుకే మొన్నొచ్చేను చూసిపోదామని. మీ ఇంట్లో గూడా అందరూ మంచాలు కరుసుకోని పడుకోనుండారు. ఊరంతా జెరాలు, వాంతులూ, బేదులూ. కాస్తె వానలూ అయ్యి పడి చల్లబడిందాకా అమ్మనీ నాన్ననీ మా ఊరు దీసకపోదామనుకుంటుండానే! ఇక్కడ తాగడానికి నీళ్లగ్గూడా బలే కష్టంగుంది. అబ్బో! పగోడిగ్గూడా వద్దమ్మా ఈ కష్టాలు. మన కాలంలో ఎప్పుడు జూశామమ్మా ఇన్ని వింతలూ విడ్డూరాలూ" అంటూ ఇద్దరూ మాటల్లో పడి ఎంకటాపురం వచ్చింది కూడా గమనించలేదు.

## 5

"ఆ! ఎంకటాపురం, ఎంకటాపురం" అని క్లీనర్ అరవడంతో ఈ లోకంలోకొచ్చారు ఇద్దరూ. చెరొకరు పిల్లల్ని బట్టుకొని దిగేరు.

"చూడే ఊరెట్టా ఉందో! ఎక్కడా పచ్చదనమన్న మాట లేకుండా చేలు జూడు పరిగ లేరుకుంటన్నాయి. ఇట్టాంటి రోజులొస్తయ్యని కల్లో గూడా అనుకోలేదు గదా!"

"సరే వస్తానే రాజ్జెం. ఆనికొస్తాలేవే మీ ఇంటికి," అంటూ పిల్లల్ని దీసుకోని గోయిందమ్మ ఇంట్లో కెళ్లింది.

సందడి సందడిగా ఉండే ఇల్లు నిశ్శబ్దంగా వుంది. అమ్మానాన్నా పంచలోనే పడుకోనుండారు. ఇల్లంతా చిందరవందరగా ఉంది. అమ్మ పక్కలో చిన్నోడు పడుకుని మూలుగుతున్నాడు. తడిపిన గుడ్డ నుదుట మీద వేసి ఉంది.

"అ...మ్మా!" అంది గోయిందమ్మ చిన్నగా. గొంతులో నుంచి చిన్నగా వచ్చిన ఆ మాట తనకే వినిపించలేదు. మళ్లీ, "అమ్మా," అని కొంచెం పెద్దగనే పిల్చింది.

కళ్లు మూసుకొని పడుకున్న మాలక్షుమ్మ కళ్లు తెరిసి చూసి, ''ఎవరూ గోయిందేనా! ఏమే ఎన్నాళ్ల కొచ్చేవే! మేముండామా, పోయామా అని చూసి పోదా మనొచ్చావా,'' అంటూ పైకిలేసి కూర్చుని, ''ఇట్రాండ్రా,'' అంటూ పిల్లల్ని దగ్గరికి పిల్చింది.

''ఏందే! ఇట్టా పీనిగె రూపం పడిపోయారు. ఏందే. ఆ పక్క ఊళ్లన్ని దివాలా తీసినట్టుండయ్యేం టనే. అదంతా మిమ్మల్ని జూస్తుంటే మీ మొకాల్లో కని పిస్తంది గదే. పిల్లల్ని ఈడకన్నా పంపియ్య గొడదంటే. సరేలేపో. ఆ సంచీ ఎత్తకెల్లి ఇంటోబెట్టి మీ వదిన బడుకోనుంది పలకరిచ్చిరా పో,'' అంది.

ఇంట్లోకి బోయి సంచీ వంకెకి తగిలించింది. అలికిడి విని కళ్లు తెరిసింది పద్మ. ''ఏందొదినా ఇట్టా మంచానికొకరు అతుక్కుపోయుండారు. ఎన్నాళ్ల నుంచి జెరం,'' అంటూ పలకరించింది.

''వారంరోజుల్నించమ్మా ఈ మాయదారి జెరం. ఇదేనా రావడం? ఎంత కాలమైంది మిమ్మల్ని జూసి,'' అంటూ పైకి లేవబోయింది.

''లేవొద్దులే పడుకో వదినా,'' అంటూ మంచం పట్టెమీద కూర్చుంది.

''పిల్లలేరి? ఎట్టుండారు? ఏంది నువ్విట్టయి బోయావు?'' అంది పద్మ.

''వాళ్లమ్మమ్మ దగ్గిరుండారు పిల్లలు. అయినా ఏంది? ఊరంతా ఇట్నే ఉందంట గదా! బుజ్జిగాడిగ్గూడా బాగలేదంటనే సగమైపోయాడు. నాయినేడి? కొష్టం దగ్గర పడుకోనున్నాడా! పిల్లోణ్ణి కాస్త మంచి డాక్టరుకి చూయించకపోయారా,'' అంది గోయిందమ్మ.

''యాడ చద్దాము. ఒకరా ఇద్దరా అందరికం దరిమీ ఇట్నే ఉండాం కదా! మొన్నటిదాకా మీ అన్న గూడా మంచంలోనే ఉండాడు. ఇదుగో ఇట్టా... ఆయన లేశాడు నేను, మీ యమ్మా పడుకున్నాము. బుజ్జిగోడికి పదిరోజుల్నుండి అట్నే ఉంది. మూసిన కన్ను తెరలేదు. మనూర్లో సూర్నారాయణే చూస్తుండాడు. మొన్నొకరోజు సెలైన్ కూడా కట్టిపోయేడు. రోజూ ఊరంతా తిరుగు తాడు గదా! మనింటిగ్గూడా వచ్చి రోజొక వరస చూసి పోతా ఉంటాడు,'' అనింది పద్మ.

''మ్మాయ్ గోయిందా! ఎప్పుడు తినొచ్చారో పిల్లలు. ఎండునక్కల్లా, నకనకలాడుతుండారు. ఆ పొయ్యి మీద కాసిని బియ్యం కడిగెయ్యమ్మా,'' అంటూ మూలుగుతూ పడుకుంది మాలక్షుమ్మ.

ఆ మాటకోసమే ఎదురు చూస్తున్నట్టుగా దిగ్గున లేచి, బియ్యం నానేసి ఎసురుబెట్టి పొయ్యి ముట్టి చ్చింది.

ఎసుట్లో బియ్యం బోసి, మూలన జాడీలో చింత కాయ పచ్చడి తీసి రోట్లో ఏసి నూరింది.

అన్నం ఉడగ్గానే ఉడుకుడుగ్గా పిల్లలిద్దరికీ పెడతా మధ్యమధ్యలో తానూ ఒక ముద్ద నోట్లో ఏసు కుంది. పిల్లలూ ఆబగా ఎన్నో లంకణాల తరువాత తిన్నట్టుగా అవురావురుమంటూ తిన్నారు.

### 6

''ఆ... ఏంది మాలక్షుమ్మా ఎట్టుంది? మనమడే మంటున్నాడు. ఇయ్యాలెన్నిసార్లు విరోశనాని కెళ్లాడు. వాంతులు కట్టుకున్నట్టేనా,'' అంటూ బ్యాగ్ సంకన బెట్టుకుని సూర్యనారాయణొచ్చేడు.

''ఏంది గోయిందమ్మే! అబ్బో ఎప్పుడొచ్చింది. ఏం? గోయిందమ్మో! బాగుండారా మీ దేశమంతా బాగుందా! ఎన్నాల్టికి జూశానమ్మాయ్ నిన్ను. కాసిని యేణ్ణీళ్లు దీసుకుని రామ్మా ఇంజెక్షన్ చెయ్యాల,'' అంటూ మందులు పగలగొట్టి మందు సిరంజిలో కెక్కించడానికి సిద్ధం జేశాడు.

''పిల్లోడికి నీళ్లు బాగా తాగిస్తున్నారా? ఒక్కసారి గాకుండా అప్పుడు కాసిని అప్పుడు కాసిని తాపి య్యండి. బాగా మరగ్గాసి చల్లార్చిన నీళ్లనే తాగించాల,'' అంటూ సిరంజీని వేన్నీళ్లల్లో ముంచి నీడిల్‌తో నీళ్లని పైకిలాగి పక్కకి చిమ్మి, మందు సిరెంజిలోకి తీసుకుని ఇంజెక్షన్ చేశాడు.

''ఇంతకీ ఈడికి తగ్గిద్దా లేకుంటే పెద్ద డాక్టర్ దగ్గి రకేమన్నా తీసకపోవాల్సొచ్చుద్దా,'' అన్నది గోయిందమ్మ.

''అమ్మా ఇదేం పెద్దమ్మవారేం గాదుకదా తగ్గకపో వడానికి. ఊళ్లో అందరికీ నేనే గదా వైద్యం జేస్తుంది. నా బాధ్యతగా నేను జెప్పాను. ఆ తరువాత మీ ఇష్టం,'' అన్నాడు బేగ్ సర్దుకుంటూ.

''ఏమోనయ్యా పదిరోజుల్నుండీ ఎట్టున్నోడు అట్నే ఉండాడుగానీ మార్పేం కనబడ్డంలేదు,'' అని గొణిగింది మాలక్షుమ్మ.

''ఏం వైదగాలో ఏమో! వాంతులూ బేదులౌ తుంటే ఇంకా ఎక్కువ నీళ్లు తాగిచ్చాలంటారు. ఏం వానాకాలం సదువులో, మందులో,'' అంటూ నిట్టూ ర్చిందామె.

''డాక్టర్ చెప్పినట్టు చెయ్యమ్మా. మజ్జెలో నీ వైద్యమేంది?'' అంది గోయిందమ్మ.

''ఊరుకోయే మిమ్ముల్లందర్నీ కనీపెంచీ, పెద్ద జేసినప్పుడు యాడుండారే ఈ డాక్టర్లు. గుడ్డొచ్చి పిల్ల నెక్కిరిచ్చినట్టుంది మీరు జెప్పడు,'' అంటూ కసిరింది.

''సరే పిల్లలకీ, మీ అన్నకీ నాలుగు మెతుకులు బెట్టి నువ్వు గూడా తిని పడుకోమ్మా, కుండా జట్టీ మూసేసి,'' అంటూ మాలక్షుమ్మ మేను వాల్చింది.

## 7

అర్ధరాత్రి చంద్రుడు మబ్బు చాటు నుంచి రయ్యి మని పరిగెత్తుతున్నాడు. ఊరు మాటు మనిగింది. జన సంచారం జాడేలేదు. ఎక్కడో ఒక కుక్క భౌభౌ మంటూ మొరుగుతోంది. కీచురాళ్ల రొద మిన్నంటుతా ఉంది.

''ఛేయ్ ఛేయ్'' అంటూ మంచం దగ్గరకొచ్చి కుయ్ కుయ్ మంటున్న కుక్కపిల్లని మాలక్షుమ్మ అదిలించింది. అది తోక ఊపుకుంటూ వెళ్లిపోయింది.

దీపం వెలుగులో ఒకసారి పిల్లోడివైపు జూసింది. ఒళ్లంతా చెమటలు పట్టిచ్చినయ్యి. ఎగశ్వాసగా దిగ శ్వాసగా ఉండి గాలి పీల్చడానికిక్కూడా తెగ ఆయాస పడుతున్నాడు.

''బ్బాయ్. రేయ్ బుజ్జిగా బుజ్జిగా లేరా, లే,'' అంటూ పిల్లోణ్ణి లేపటం విని పద్మ లేసింది. సీనూ లేశాడు. ఈ సందడికి గోయిందమ్మ, పిల్లలు అందరూ లేశారు. మంచం చుట్టూ మూగేరు. ''కదిలియ్యండి, నోరు దెరిసి చూడండి, నీళ్లు జల్లండి,'' అంటూ గాబరా గాబరాగా తలొక మాట చెప్పారు.

''ఒరే సీనూ, పిల్లోడికేందో మైకం కమ్మిందిగాని పోయి సూర్నారాయణ్ణి పిల్చుకరా పో,'' అనడంతో సీను చొక్కా కూడా వేసుకోకుండా, కాళ్లకు చెప్పులైనా లేకుండా హడావిడిగా పరిగెత్తాడు.

''ఏందమ్మా, ఏందిదే. మీరేమో వాణ్ణి పెద్ద డాక్టరుకి చూయించమంటే అదే తగ్గుద్ది అదే తగ్గుద్దని కూచ్చునుండారు. వొచ్చినప్పట్నుంచీ వాణ్ణి జూసే నాకెందుకో అనుమానంగా ఉంది. యాడ నా మాట...'' అంటూ డాక్టర్ని జూసి ఆగిపోయింది గోయిందమ్మ.

''లేవండి. తప్పుకోండి,'' అంటూ చెయ్యి పట్టు కొని నాడి చూశాడు. ఎక్కడో బలహీనంగా కొట్టుకుం టోంది. రెప్పలు కిందికి లాగి చూశాడు. వొళ్లు పట్టుకు చూశాడు. చల్లగా ఉంది. హడావుడిగా బేగ్గులో నుంచి మందుబుడ్డి తీసి ఇంజక్షన్ చేశాడు. అయినా చలనం రాలేదు.

కాసేపటికి నాడి కూడా కొట్టుకోవడం ఆగిపో యింది.

''ప్చ్! లాభంలేదు,'' అని పెదవి విరిచాడు సూర్యనారాయణ. అంతలోనే అతనికి కోపం వచ్చింది.

''ఏందమ్మా మేం జెప్పిన మాట వినరు. మీకు తోసిన వైద్యం మీరు జేస్తారు. ఇయ్యేమన్నా సత్తెకాలపు రోజులా? మీ వైద్యానికి జబ్బులు తగ్గడానికి,'' అని అరుచుకుంటూ విసురుగా వెళ్లిపోయాడు.

''అయ్యో! అప్పుడే నూరేళ్లు నిండేయిరా నాయనా. నిన్ను మా సేతుల మీదుగానే సాగనంపతిమి గదరా తండ్రీ,'' అంటూ శోకాలు మొదలుబెట్టేరు అందరూ.

''ఇప్పుడేడిసి ఏమి లాబమే? ముందుండాల. మొదట్నించీ ఉండాల. సొంత వైదగాలు జెయ్యబాకండే జెయ్యబాకండే అని నెత్తీనోరూ బాదుకుంటే విన్నారా! ఇప్పుడు జూశారుగా. థూ! నీయమ్మ మీ పొట్టన బెట్టు కున్నారుగదే,'' అంటూ ఏడుపుతో కళ్లు తుడుచు కుంటూ విసురుగా ఇంట్లోకిపోయాడు శీనయ్య.

ఏడ్చుకోని ఏడ్చుకోని అందరూ సొమ్మసిల్లి పోయారు. పిల్లలిద్దరూ బిక్క మొహాలేశారు. ఇంక ఏడవ డానికి ఓపిక లేక తలలు వేలాడేసి చిన్నగా రొదలు మొదలుబెట్టడంతో మూలుగులు మాత్రం వినిపిస్తు న్నాయి.

తెల్లగా తెల్లవారింది. ఇరుగూ పొరుగూ అందరూ చేరారు.

''ఇంకెందుకు బుగ్గు చెయ్యల్సినోణ్ణి ఎదురుగా బెట్టుకోని. పోయినోడు రాడుగదా'' అంటూ పెద్దాయనొ కాయన అనడంతో మళ్లీ ఏడుపులు మిన్ను ముట్టాయి.

ఒలుకుల్లో గుంట దియ్యడానికి మనిషిని పంపించారు.

''ఇంతకాలం పెంచింది గుంటలో పెట్టి గంట వాయించడానికా, వామ్మో. వాయ్యో. ఓరి దేవుడో,'' అంటూ గుర్తొచ్చినప్పుడల్లా ఎవురో ఒకరు అరుస్తానే ఉన్నారు.

వీళ్లందర్ని తప్పించి పక్కకు లాగి తెల్లగుడ్డలో పిల్లోణ్ణి జుట్టి సీను చేతుల్లో బెట్టేరు. ఏడుపు మొహం తోనే సీను రెండు చేతుల్తో ఎత్తుకొని పోయి శ్మశానంలోకి తీసుకెళ్లి పూడ్చేశాడు.

## 8

బుజ్జిగాడి చావు అందర్నీ కోలుకోకుండా జేసింది. ఎవురికి వాళ్లు మంచాలు బట్టుకుని అలాగే ఉండి పోయారు. ఇంట్లో అందరి మొహాల్లోనూ ఒక నెల రోజుల పాటు శోకదేవత తాండవించింది.

ఈ చావు ఎవరివల్ల జరిగిందో ఏమోగాని, మాలక్షుమ్మ మనసు నిండా మాత్రం అపరాధ భావం నిండిపోయింది.

ఎవ్వరూ సరిగ్గా తిండి తినడమే మానేశారు. పిల్లల కోసం గోయిందమ్మకు లేవక తప్పడం లేదు. ముసలాయన కూడా ఆకలికి ఉండలేడు. అందుకని రోజూ పొయ్యి రాజెయ్యడం, వంట చెయ్యడం, అందర్నీ వొక వరస బతిమాలాడడం గోయిందమ్మ వంతయింది.

''ఎవురికి వాళ్లు ఇట్నే మంచాలు బట్టుకు కూసుంటే పరమట సేలో కందెండి పోయింది. పొద్దు దిరుగుడు, ఆముదం అట్నే ఉండయ్యి. వాటినట్నే వొదిలేస్తే నేలపాలవుతయ్యి. అప్పులోళ్లు చుట్టు ముడతారు. అప్పుడొక డబ్బా మందు దెచ్చుకుని తలొక గుక్క దాగి కట్టగట్టుకు చావడమే,'' అంటూ ముసలాయన సతాయించడం మొదలుబెట్టేడు.

''పోయినోళ్లుతో మనమూ పోలేం గదా. లేసి కాస్తె ఎంగిలి పడండి. పనులు తరువాత సంగతి. ఇప్పటికీ ఇంట్లో తిండిగింజలు కూడా అయిపోవొచ్చినయ్యి. ఆ నాలుగ్గిత్తలు కూడా అయిపోతే అప్పుడేద్దురుగానీ నాటకం,'' అంటూ పొలానికెళ్లాడు ముసలాయన.

గోయిందమ్మకు చాలా ఇబ్బందికరంగా ఉంది. అటు పనిచేద్దామని పైకి లేస్తే, 'చూడమ్మా పోయింది తన బిడ్డ కాదనేగా హాయిగా వొండుకొని తిని దర్జాగా తిరుగుతుంది. దానికేం దిగులా ఇశారమా,' అంటారని అదొక బాధ.

లేవకుండా అట్నే పడుకుంటే, 'బాగలేదు కదా ఇంట్లో అందరూ పుట్టెడు దుఃఖంలో ఉండారు కదా, ఒక పనన్నా ఎగదొయ్యకుండా ఎట్టా పడుకునుందో,' అని అటుగూడా అంటారని సతమతమైపోతంది.

ఇక్కడ గూడా పండించి పోసినియ్యి పెద్దగా ఏం లేవు. అట్టని ఉన్న పళంగా యెల్లిపోవడానికి ఏం శికా శాపం లేకపాయె. కట్టుకున్నోడేమో కాలికొద్ది యెటెల్లి పోయేడో పోయేడు. రోజూ ఒకొరస ఊరంతా దిరిగి విచారిస్తానే ఉంటే, ఎవరూ జాడ చెప్పినవాళ్లు లేకపోయే.

వొచ్చి నెలరోజులు దాటింది. మంచీ సెబ్బరా మాట్లాడుకోవడానికి అస్సలు సందేలేకుండా పోయింది. వాళ్లే పుట్టెడు దుఃఖంలో మునిగిపోయుండంగా ఇంక తనను విచారించేదెవరు.

అందరితోపాటు గోయిందమ్మ కూడా పొలం వెళ్లి పనులు ఎగదోస్తుంది. ఇంటికొచ్చి ఇంటెడు చాకిరీ తనే చేస్తుంది. అయినా ఎవురూ ఎవరితో మనసు విప్పి మాట్లాడుకోవడం లేదు. ఏదో పని చెయ్యాలి కాబట్టి యాంత్రికంగా చేసుకుంటూ పోతున్నారు.

వర్షాలు సరిగ్గా పడక, పంటలు పండీ పండక యేటా వచ్చే రాబడిలో కనీసం సగానికి సగం ఆదాయం గూడా రాకుండా దిగుబడి వచ్చింది. మొన్నటిదాకా పిల్లోడిది దిగులైతే, ఇప్పుడు కొత్త దిగులొచ్చి పడింది. ఈ వొచ్చిన పంటతోటి అప్పులోళ్లకెట్టా సమాధానం చెప్పాలోనని అందరూ సతమతమౌతుండారు.

పొలాల్లో పనులన్నీ అయిపోయాయి. అయిన కాడికి గింజలు కూడా ఇంటికి వచ్చేశాయి. బస్తాల్తోటి ఇల్లంతా కిక్కిరిసిపోయింది. ఇంట్లో అటూ ఇటూ మొసల్దానిగ్గూడా చాలా ఇబ్బందిగా ఉంది.

ఇన్ని రోజులూ పొలంలో పనులుంటే, గోయిందమ్మ ఆ పనులు జేస్తూ ఇంటి దగ్గర అన్ని పనులూ ఎగదోస్తా ఉంటే ఎవురికీ ఏమీ అనిపించలేదు. పైగా ఒక మనిషి అనుకోకుండా ఆదరువు దొరికినట్టుగా కూడా అనిపించింది. ఎటొచ్చీ ఇప్పుడు అన్ని పనులూ అయిపోయి ఇల్లంతా ఇరుకిరుకు అయిపోయి అందరూ విశ్రాంతిగా ఉండటంతో గోయిందమ్మ, పిల్లలూ ఇబ్బందిగా కనిపించడం మొదలయ్యింది.

అన్న చూసీచూడనట్లు, పలికీ పలకనట్లు అంటీ ముట్టకుండా ఉంటున్నాడు. వొదిన పలకడమే మానేసింది. పైగా, ''ఏవేళా విశేషమో, ఇంటికి ఏదో శని దాపురించింది. అందుకే ఒకదాని వెంట ఒకటిగా అన్నీ చెడుగానే జరుగుతున్నాయి,'' అంటూ మొదలు పెట్టింది. ఇక అమ్మానాన్నల్దేముంది. ఎంతైనా చెట్టుకి కాయలు బరువవుతయ్యా.

అయినా ఎందుకో మాలక్షుమ్మ కూడా అసహనంగా కన్పించడం గోయిందమ్మ గమనిస్తూనే ఉంది. ఆమె ఏదో చెప్పాలనుకుంటది. నోటిదాకా వొచ్చినట్టే వొచ్చి చెప్పలేక ఆగిపోతంది.

''ఏందంట చెల్లెలుగారు, ఈణ్ణే ఉంటానికి వొచ్చిందా ఏంది. అంతకుముందెప్పుడూ ఎన్నిసార్లు చెప్పినా రావడం కుదర్లేదు. ఈడ పనుల్తోటి తెగ ఇదై పోతన్నా అనేదిగా. ఇప్పుడెందుకొచ్చింది. ఈణ్ణే తిష్టేసేటట్టుందే. ఈడేమన్నా పుట్లుపుట్లు పండించి పోసుండయ్యా. మనమే మూడు మూసి ఆరు అతుకుతుండాము. ఇన్ని రోజులంటే పనులుండబట్టి చే ఆదరువుగా ఉండింది. ఇంకా ఎంతకాలం తెచ్చిపెడతామంట,'' అంటూ పద్మ సణగడం మొదలుపెట్టింది.

"ఏయ్ ఊరక ముండమోపి మాటలు మాట్లాడ బాక. ఇన్ని రోజులూ అది లేకపోతే ఎవరు జేశారే. ఇన్ని రోజులైంది అదొచ్చి, ఎవురిమన్నా దాని దిగులు ఇశార మేందో ఆలోచించామా. ఊరక నోరుందని నోరు బారేసుకోగూడదు," అన్నాడు సీను.

"ఆ అంత సొతంత్రం లేని మణిసైతేనా ఇన్ని రోజులుండి పోయింది. తినే సొతంత్రమేనా, పనిజేసే సొతంత్రం ఉండదా ఏంది పుట్టింటికాడ."

"బాగా చెప్పొచ్చేవులేవే. పెద్దమడిసివి. ఇన్ని రోజు లుందంటే ఏం కారణం లేకుండా ఉండదు. ఆ ఊళ్లల్లో అసలు పంటలే పండలేదంట. వాడు కూడా ఇల్లూ వాకిలీ పట్టిచ్చుకునే రకంగాదు. అసలే దానికి రోష మెక్కువ. అనవసరంగా మాట్లాడి గొడవ చెయ్యొద్దు. పుల్లిరుపు మాటలు మాట్లాడి దాని మణుసు ఇరిసె య్యొద్దు."

"అవున్లే అందరూ రోసం కేసం లేకుండా పడుం డారు. ఇంట్లోనే ఉంచుకుని ఆపతెద్దుని మేపినట్టు మేపు. నామాటొక లెక్కాజమా నీకు," అంటూ కళ్లు వొత్తుకుంటా, ముక్కు చీదుకుంటా బయటికొచ్చింది.

పంచలో గోయిందమ్మ ఉండటంతో కంగు తినింది. తమాయించుకుని తలొంచుకునే కొష్టంలో కెళ్లింది.

ఏదో పనుండి బైటికి బోయిన గోయిందమ్మ పందిట్లో అడుగుబెట్టడం, వీళ్ల మాటలు చెవున బడడంతో బయటే ఆగిపోయింది.

మాలక్షుమ్మ కూడా అక్కడే పంచలో కుచ్చొని వాళ్ల సంభాషణ అంతా వింటూనే ఉంది.

"చూడమ్మా. వొదినెట్టా మాట్లాడతుందో మాకాడ అతీగతీ లేకేగదా, ఈడకొచ్చి ఇన్ని రోజులుంది. ఎప్ప డన్నా ఒక్కపూట కంటే ఎక్కువుండానా నీ ఇంటికాడ. కాని కాలమొచ్చి చెట్టుకొకరు పుట్టకొకరు పరారయి పోతేనే గదా ఇన్ని రోజులిక్కడ నిలబడింది. ఇల్లు దాటి పోయినాక మీ ఇంటికొచ్చి అమ్మా ఇదిగో నాకిది గావా లని ఎప్పుడన్నా చెయ్యి జాపేనా, ఇప్పుడు కట్టుకున్నోడు గూడా పట్టించుకోకుంటేనే గదా ఈడకొచ్చింది."

"అమ్మా ఊరుకోమ్మా. ఇయ్యాల నీ సెవున బడిందమ్మా. పదిరోజుల్నుంచి ఇదే గోల. వాణ్ణి తెగ సతా యిస్తా ఉంది. వాడేమో ఎటూ పాలుపోక సతమత మవుతా ఉండాడు."

"ఆడ జేసినన్నాళ్లు తిన్నావా లేదా అని అడిగిన పాపాన బోయినోడు లేడు. సరే లేకపోతే పోయిందిలే అనుకోని ఆడదాన్నీ మొగోణ్ణీ నేనే అయ్యి జేశాను. ఇప్పుడు ఇంటిచుట్టూ అప్పులు. ఆయనెటు బోయాడో తెలియదు. ఇల్లు జరగటం కష్టంగా ఉంది. ఎటూ పాలుపోక ఈడకొచ్చేనుగానీ, ఈడ ముల్లెలు ఏసుకోని పోదామని రాలేదు. పిల్లలొక తగలాటకమయ్యేరుగానీ, వాళ్లే లేకుంటే ఎప్పుడో ఇంత విషం మింగి చచ్చేదాన్ని," అంటూ మాలక్షుమ్మని బట్టుకొని బోరుమని ఏడ్చింది.

"యాడవబాకమ్మ అసరసందేళ యాడవ గూడదు. నిన్నల్లడిచ్చడానికి నీ యెదాన పడ్డాడు. వాడు సరీగుంటే నీకియాల ఇన్ని కష్టాలెందుకొస్తయ్యి. ఊరుకో ఊరుకో మొహానెట్ట రాసుంటే అట్నే జరుగుద్ది," అని సముదాయించింది మాలక్షుమ్మ.

## 9

ఆ రాత్రి ముసలాయన, పిల్లలూ తప్ప ఎవరూ ఎంగిలి పడలేదు. దీపం దానిపాటికి అది వెలుగుతూనే ఉంది. ఎక్కడ తలుపులు అక్కడ బార్లా తీసి అందరూ ఎవరిపాటికి వాళ్లు నిద్రపోయారు.

గోయిందమ్మకు కంటి మీద కునుకు లేదు. కళ్లు మూసినా తెరసినా వాళ్ల మాటలే గుర్తొస్తున్నాయి. ఏంజెయ్యాలో ఎటూ పాలుపోవడంలేదు. ఏ దరీ దోచడం లేదు. పక్కకి చూసింది. పిల్లలు ఆదమరచి నిద్రబోతున్నారు. ఎంత బతుకు బతికేను. అంత సంసా రాన్ని ఒంటిచేత్తో ఈదేను. ఊళ్లో 'ఫలానా ఆడదిరా,' అనిపించుకున్నాను. 'మొగోడు పనికిమాలినోడైనా నిలబడి చేస్తుందిరా,' అనిపిచ్చుకున్నాను. ఇంటికొచ్చిన ఏ పనోడికి అడిగింది లేదనకుండా బెట్టేదాన్ని. నాలాగా అందరు సుకంగా ఉండాలనుకునే ఎర్రిబాగుల్దాన్ని. అందరూ అట్నే వుంటారనుకోవడం ఎంత బుద్ధితక్కవ తనం. ఎవురు కష్టాలు పడుతున్నా చేతనైనంతలో ఎవురి కైనా సాయం చేసేదాన్ని. యాడకి బోయింది ఆ పుణ్ణ మంతా. ఓడలు బళ్లవుతుంటాయంటే ఇదే గామాల.

బగవంతుడా ఎంత అగ్నిపరీక్ష పెట్టేవయ్యా. వచ్చి వచ్చి ఇక్కడ పడ్డాను. ఇంత కాని కాలంలో ఆదుకునే మనసు గూడా లేనోళ్లా తన పుట్టింటోళ్లు అనుకుంటేనే గుండె తరుక్కుపోతంది. కాలం ఎవరిసేతనై, ఏదైనా మాట్లాడిచ్చుద్దిలాగుంది. ఏదేమైనా ఇంక ఈడ ఉండట మంత నామర్దా లేదు.

ఈ రోజులిట్టా ఉంటే పిల్లల్నేసుకుని ఎక్కడికని పోయేటట్టు. పోనీ వాళ్లని వొదిలేసి...! అమ్మో రత్నాలు లాంటి బిడ్డలు. వాళ్లని వొదిలిపోవడమంటే అమ్మో! నేను లేకపోతే ఎవురు జూస్తారు. అన్యాయమైపోరా!

అనుకుంటూ ఆకాశం వంక చూపు సారించింది. చుక్కలు మిలమిలా మెరుస్తున్నాయి. ఒక్కో చుక్కనీ లెక్కపెట్టడం మొదలుపెట్టింది. ఎంతకూ లెక్క కుదరడం లేదు. ఒకటి లెక్కొస్తే ఇంకోటి జారిపోతూనే ఉంది. ఈ చుక్కల వెలుగు అంతా మనకి చేరక పోయినా అయ్యి ఎలగడం మానుకుంటన్నయ్యా అనుకుంది.

ఒక నిర్ణయానికి వొచ్చేసిన దానిలాగా పైకి లేసింది. ఇంట్లో అంతా వెలుతురుగానే ఉంది. బయట లోకమంతా చీకట్లో మునిగి తేలుతుంది. పిల్లల వంక చూసింది. అమాయకంగా ఉన్న వాళ్ల ముఖాలు చూసి వాళ్లని వొదిలిపెట్ట బుద్ధి కాలేదు. అయినా తప్పదన్నట్లు ఆ వెలుతురులో నుండి చీకట్లోకి మాయమైపోయింది.

ఊరి చివర ఉన్న పాడితోటల్లో ఉప్పునీళ్ల బావి దగ్గరికి చేరింది. చీకట్లో బావి చుట్టూ చిల్లచెట్లు జడలు విరబోసుకుని ఊగుతున్నట్టుగా ఉన్నాయి. చుక్కల వెలుతుర్లో బావి మేతమేసి నిమ్మళంగా పడుకున్న ఆంబోతులా ఉంది.

గోయిందమ్మ బావి లోపలికి తొంగి చూసింది. బావి నిండా చీకటి చిక్కగా పారబోసినట్టుగా ఉంది. గుండెల్లో గుబులు బుట్టింది. అయినా మొండి ధైర్యం తో బావి బొడ్డు మీదకు ఎక్కింది. ఏడుపు పొగిలిపొగిలి వొచ్చింది. ఆ చీకట్లో పైకే ఏడ్చేసింది. మళ్లీ పిల్లలు గుర్తొచ్చారు. వాళ్లని వొదిలి పెట్టి చావాలంటే మనసు రాలేదు.

బావి మీద నుండి దిగింది. ఆ చీకట్లో అప్పుడు చాలా భయమేసింది. వొడివొడిగా వెనక్కి తిరిగి చూసు కుంటూ ఇంటికి వొచ్చేసింది.

ఇంట్లోకి పోయి గుడ్డల్ని సంచిలో కుక్కుకుని సంకకు తగిలించుకుని బయటకు వొచ్చింది. పడుకుని ఉన్న పిల్లల్ని పైకి లేపింది. వాళ్లు యాలబడిపోతున్నారు. ఇద్దర్నీ చెరొక చేత్తో పట్టుకుని నడిపించబోయింది. అడుగు వెయ్యకుండా వాళ్లు వొరిగిపోతున్నారు.

ఇంక లాభం లేదనుకుని పిల్లలిద్దర్నీ రెండు భుజాల మీదకు ఎత్తుకుంది. ఇద్దరి తలల్నీ తన తలకు ఆనించుకుంది. అలాగే వొరిగి పిల్లలు నిద్రపోతూనే వున్నారు చీకటిని చీల్చుకుంటూ వొడివొడిగా నడవ సాగింది. తెల్లారేసరికి ఆ ఊరు చుట్టుపక్కల ఉండ కూడదన్న మొండిధైర్యంతో ముందుకు సాగిపోయింది. చీకటి కొద్దికొద్దిగా పల్చబడసాగింది.

*2003 తానా సావనీర్‌లో అచ్చయి,*
*ఆదివారం ఆంధ్రజ్యోతి 29 జూన్, 6 జూలై 2003 సంచికల్లో పునర్ముద్రితం*

